# ప్యాకేజీ మాస్టర్లతో నష్టం లేదు

- బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు
- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



బొమ్మరాశిపేట కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ /శామీర్‌పేట, నవంబరు 23: ప్యాకేజీకి మాస్టర్లతో నష్టం లేదని, బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి మల్లారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొంత మంది నేతలు ప్యాకేజీలు తీసుకొని, కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. జన్మనిచ్చిన ఊరికి, ప్రజలకు చేసేందేమీ లేదన్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసమే వారి ఆరాటమని, ఎవరెన్ని చెప్పినా.. ప్రజలు నమ్మరన్నారు. పని చేసే బీఆర్ఎస్ ప్రభుత్వం వైపు ప్రజలు ఉన్నారని, విశ్వాసానికి మారుపేరు కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల కాలంలో తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌కు రెండు కండ్లు అన్నారు. రైతుబంధు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ లాంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇంటింటికి తాగు నీళ్లు, 24 గంటల కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న గ్యారంటీకి ఎలాంటి వారంటీ లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే సౌభాగ్యలక్ష్మి కింద మహిళలకు రూ.3వేల భృతి లభిస్తుందని, అర్హులందరికి రూ.5 లక్షల బీమా అమలు అవుతుందని, రూ.400లకే సిలిండర్ లభిస్తుందని, రైతుబంధు రూ.16 వేలు అవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారమిస్తే దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్టు ఉంటుందని, అభివృద్ధి ఆగమైపోతుందన్నారు. 24 గంటల కరెంట్ 3 గంటలకు పడిపోయి, పంటలు పండక ఆత్మహత్య చేసుకునే గత పరిస్థితులు వస్తాయని తెలిపారు. పేదోడికి అండగా నిలిచే, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో మారోమారు తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎంపీపీలు బాయిబాబు, హారిక మురళీ గౌడ్, జడ్పీటీసీ అనితా లాలయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఉద్దెమర్రి సర్పంచ్ అనూరాధ్ధ, లలితా నర్సింహ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో
# గులాబీ జెండా ఎగురాలి

- లాస్య నందితకు భారీ మెజార్టీ వచ్చేలా చూడాలి
- బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్‌తో మంత్రి కేటీఆర్



ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసిన కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్

కంటోన్మెంట్, నవంబర్ 23: కంటోన్మెంట్ నియోజకవర్గం గడ్డపై గులాబీ జెండా రెపరెపలాడాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్ కలిశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్‌లో తాజా పరిస్థితులపై ఎంఎన్ శ్రీనివాస్‌ను మంత్రి కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేస్తేనే అక్కడి సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని ఎంఎన్ శ్రీనివాస్‌కు మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. విపక్ష పార్టీలను దీటుగా ఎదుర్కొనేలా ముందుకు సాగాలన్నారు. కంటోన్మెంట్‌లో దివంగత ఎమ్మెల్యే సాయన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్‌కు సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరినీ కలిసే విధంగా పకడ్బందీ ప్రణాళికతో అభ్యర్థి లాస్య నందిత తిరిగేలా చూడాలన్నారు. లాస్య నందితను భారీ మెజార్టీతో గెలిపించుకు రావాలని ఎంఎన్ శ్రీనివాస్‌కు మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.



కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు మద్దతు ప్రకటిస్తున్న మాల సంఘం ప్రతినిధులు

# కంటోన్మెంట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..

- బీఆర్ఎస్‌కు జై కొట్టిన దళిత సంఘాలు
- లాస్య నందితకు సంపూర్ణ మద్దతు తెలిపిన మాల సంఘం ప్రతినిధులు

కంటోన్మెంట్, నవంబర్ 23: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్య నందిత స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో దళిత సంఘాలన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్య నందితకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రధానంగా ఆడబిడ్డ వెన్నంటి ఉంటామని మాల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు మాల సం ఘం ప్రతినిధులు కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మె ల్యే అభ్యర్థి లాస్య నందితను మర్యాద పూర్వకంగా కలిసి, మద్దతును తెలిపారు. అన్ని సామాజికవర్గాలు తనకు సంపూర్ణ మద్దతు పలకడం మరిచిపోలేనని చెప్పారు. తనకు ఈ స్థాయిలో మద్ద తు లభించడం చూస్తుంటే భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తనపై నమ్మకంతో మద్దతు ప్రకటిస్తున్న కంటోన్మెంట్ ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత తప్పకుండా పెండింగ్ పనులను పూర్తి చేస్తామని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న మాదిరిగానే తాను కూడా ప్రజాసేవ చేసి, కంటోన్మెంట్ అభివృద్ధికి పాటుపడతానని లాస్యనందిత వెల్లడించారు. గీతమ్మ, మాలల ప్రతినిధులు సుమన్, చన్నేశ్వర్ పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్నాం
- రోజు రోజుకు బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ
- అభివృద్ధికి కోట్ల రూపాయలను వెచ్చించాం
- సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్



లాలాపేట మార్కెట్‌లో పార్టీ నాయకులు, మహిళలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గౌడ్ తదితరులు

సికింద్రాబాద్, నవంబర్ 23: కోట్లాది నిధులను వెచ్చించి సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తార్నాక డివిజన్ పరిధిలో ఎన్నికల ప్రచార పాదయాత్ర గురువారం నిర్వహించారు. ముందుగా డివిజన్ పరిధిలోని లాలాపేట ప్రాంతంలో పార్టీ జెండాను ఆవిష్కరించి నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డితో కలసి పాదయాత్రను ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలి వచ్చి ఆయన వెంట నడిచారు. లేబర్ అడ్డా, లాలాపేట, తార్నాక, ఆర్యనగర్, విద్యమందిర్ స్కూల్ లేన్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. స్థానిక కార్పొరేటర్లు హేమలతతో పాటు పద్మారావు గౌడ్ తనయులు కిషోర్ గౌడ్, కిరణ్ గౌడ్, త్రినేత్ర గౌడ్‌లు ఎన్నికల ప్రచార పాదయాత్రలో భాగస్వాములయ్యారు. తార్నాకలో పద్మారావు గౌడ్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. మహిళలు మంగళ హారతులు పట్టారు. గులాబీ పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సికింద్రాబాద్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉన్నామని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపామన్నారు. పార్టీ చేపట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందేలా తాము కృషి చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు తమపై అభిమానంతో ఎన్నికల ప్రచార పాదయాత్రకు స్వచ్ఛందంగా తరలి వచ్చి పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు కంది నారాయణ, కరాటే రాజు, సుంకు రాంచందర్, మల్లూరి అనిల్, గరికపాటి చంద్రశేఖర్, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, రాజాసుందర్ పాల్గొన్నారు.

# మరోసారి గెలిపిస్తే.. డబుల్ అభివృద్ధి చూపుతా..


*శేరి లింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీ*



ఎమ్మెల్యే గాంధీకి గజమాలతో ఘన స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

మాదాపూర్, నవంబర్ 23: అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీకే మద్దతును అందిస్తుండటం సంతోషంగా ఉందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, ప్రకాష్ నగర్ కాలనీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి గురువారం ఇంటింటి పాదయాత్ర చేస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆయన మాట్లాడుతూ, శేరిలింగంపల్లిలో ఎక్కడికి వెళ్ళిన అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గుచూపుతున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌కు మద్దతు పలకడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో శేరిలింగంపల్లిలో ఇప్పటి వరకు రూ.9 వేల కోట్ల నిధులతో అనేక మౌలిక వసతులు, అభివృద్ధికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలే బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.





# ఇండియన్ ఫొటో ఫెస్టివల్ షురూ..

కొండాపూర్, నవంబర్ 23: ఫొటోగ్రఫీతో జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డైవలప్మెంట్ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఫొటో ఫెస్టివల్ 9వ ఎడిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం, ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫొటోగ్రఫీతో జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని, గడిచిన కాలాన్ని సైతం కండ్ల ముందుంచ గల శక్తి కేవలం ఫొటోగ్రఫీ సొంతమన్నారు. అన్ని రకాల పరిస్థితులను ఫొటోలలో బందించగలరన్నారు. ఫొటో ఫెస్టివల్‌లో 40 దేశాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు 2500ల చిత్రాలను ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.